ప్రజాశక్తి

శనివారం 4 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

20 నుంచి భూముల రీ సర్వే

మండలానికి ఒక గ్రామం ఎంపిక - తొలి విడత 14 గ్రామాల్లో సన్నాహాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో భూముల రీ సర్వే ఈనెల 20 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలో ఒకగ్రామాన్ని సర్వేకు ఎంపిక చేశారు. రోజుకు 20 ఎకరాలు మాత్రమే రెవెన్యూ సిబ్బంది రీ సర్వే నిర్వహిస్తారు. తొలి విడతగా జిల్లాలో 14 గ్రామాలను ఎంపిక చేయగా తొలుత ప్రభుత్వ భూములు, చెరువు, పోరంబోకు భూములు, అసైన్డ్ వివరాలను కూడా నమోదు చేస్తారు. ప్రధానంగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ, చెరువు, కుంటలు, పోరంబోకు భూముల స్థితిగతులు, రికార్డులో ఉన్న గణాంకాలకు, వాస్తవ పరిస్థితులను నమోదు చేస్తారు. ఏ భూమి ఎవరి అధీనంలో ఉందో నమోదు చేస్తారు. పట్టా భూములకు సంబంధించి అన్ని పత్రాలను పరిశీలించి మార్పులు చేర్పులు చేస్తారు. అసైన్డ భూములైతే ప్రభుత్వం ఎవరికి పంపిణీ చేసింది. ఎవరు అనుభవిస్తున్నారనే వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రెవెన్యూ అధికారులు తొలుత ఈ సమాచారం నమోదు చేసిన తరువాత సర్వేకు సంబంధించి రైతులకు సమాచారం ఇవ్వాలి. జిల్లాలో మొత్తం 178 గ్రామాలు ఉండగా గత ప్రభుత్వ హయాంలో 62 గ్రామాల్లో సర్వే చేశారు. వీటిల్లో ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వివాదాలు అర్జీల రూపంలో అధికారులకు అందుతున్నాయి. ప్రస్తుతం రెవెన్యూ వివాదాల పరిష్కారంపై జాప్యం జరగడంపై సిఎం చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సమస్యలు పరిష్కరించకపోవడంపై అధికారులను సిఎం నిలదీశారు.

గతంలో సర్వే నిర్వహించిన అనేక గ్రామాల్లో కూడా అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. గతంలో గ్రామసభలు నిర్వహించి సర్వే వివరాలను రైతులకు వివరించి వారితో ▶ 2లో

రెవెన్యూ సదస్సులకు పెరిగిన అర్జీలు

జిల్లాలో 178 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ఇప్పటి వరకు 3940 అర్జీలు ప్రజల నుంచి అందాయని జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి తెలిపారు. ఇందులో 342 అర్జీలు పర్కిరించినట్టు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈనెల 20న జిల్లాలో రెవెన్యూ సదస్సులు ముగుస్తాయని, అదేరోజు రీ సర్వే తిరిగి ప్రారంభం అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

సర్వే నిమిత్తం ప్రత్తిపాడు మండలంలో ఇటీవల మ్యాప్‌లను పరిశీలిస్తున్న అధికారులు

ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : రైతు సంఘం - 4 లో

మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

190 మందిలో106 మందికి అర్హత - 2 లో

ఆగిన ఎసిసి కార్మికుని గుండె

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎసిసి అక్రమ లాకౌట్ అనంతరం నష్టపరిహారం కోసం ఎదురుచూసిన ఓ కార్మికుడి గుండె పరిహారం కోసం పరితపించి గురువారం ఆగింది. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎసిసి కార్మికుడు అంద్ర నాగేశ్వరరావు (69) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎసిసి కార్మికులు జరిపే న్యాయ పోరాట దీక్షలలో రోజు పాల్గొనే నాగేశ్వరరావు మృతి పట్ల పలువురు కార్మికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. చనిపోయే ముందు రోజు కూడా దీక్షలలో పాల్గొన్న నాగేశ్వరరావు ఇక లేడనే విషయాన్ని జీర్ణించుకోలేక, కుటుంబ సభ్యులతో పాటు, ఎసిసి కార్మికులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇటీవల ఆయన పెద్ద కుమారుడు చనిపోవడం, నాగేశ్వరరావుకు పెరాలసిస్, గుండె సంబంధించిన వ్యాధితో ▶ 2లో

నాగేశ్వరరావు (ఫైల్)

అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలి

కలెక్టరేట్ వద్ద జరిగే నిరసనలకు మద్దతు : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పోస్టులు భర్తీ చేయాలని ఈనెల 6 నుండి 10వ తేదీ వరకూ కలెక్టరేట్ వద్ద జరిగే నిరసనలకు సిపిఎం మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వర్కర్స్ పోస్టులకు అర్హులైన హెల్పర్స్ దరఖాస్తు చేసుకుని ఏడాదికిపైగా ఎదురుచూస్తున్న వారికి ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. జిల్లాలో 1485 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వాటిలో దాదాపు 100 కేంద్రాల్లో వర్కర్, హెలర్స్ ఏదో ఒక పోస్టు ఖాళీగా ఉందని, ఇద్దరుంటేనే సెంటర్ నిర్వహణ సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఏవరోఒకరే పనిచేస్తుండటం వల్ల వారికి వంటవండి పెట్టటానికే సరిపోతుందని, విద్యను అందించే పరిస్థితి లేదని, అధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లోనూ ఖాళీలు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ గుంటూరు జిల్లాలో అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టలేదని, దీనివల్ల లబ్ధిదారులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆలస్యమైతే త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని, పోస్టుల భర్తీకి కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.

గుంటూరు, నరసరావుపేట ధర్నాల్లో పాల్గొన్న కార్మికులు, నాయకులు

ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు - పలుచోట్ల ధర్నాలు

ప్రజాశక్తి-గుంటూరు, మంగళగిరి, పల్నాడు జిల్లా

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో సమ్మెకు కూడా వెనుకాడబోమని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపు, గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాల అమలు కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ధర్నాలలో భాగంగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాయం ఎదుట, ఇతర మున్సిపాల్టీల్లో శుక్రవారం ధర్నాలు చేశారు. గుంటూరు ధర్నాలో ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా కార్మికుల సమస్యలను ఏమాత్రమూ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో కేవలం రూ.15 వేల జీతంలో ఇంజినీరింగ్ కార్మికులు బతకలేక అవస్థలు ▶ 2లో

ఆరోగ్య కేంద్రం నుండి ఎయిమ్స్‌కు డ్రోన్

రెండు నిముషాల్లో నమూనాల తరలింపు - పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని ఇందిరా నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం నుండి ఎయిమ్స్‌కు గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్ కోసం పిఎపి స్మెర్ నమూనాలను డ్రోన్ సహాయంతో రెండు నిమిషాల్లో పంపించడంతో వైద్య రంగంలో ఆంధ్రప్రదేశ్ మరో మైలురాయిని అధిగమించిందని, ఇది విప్లవాత్మక మార్పులకు నాంది అని ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇందిరానగర్ ఆరోగ్య కేంద్రం నుండి ఎయిమ్స డ్రోన్ సేవల పైలట్ ప్రాజెక్ట్‌కు ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ మధ్యనే డ్రోన్ షో చేశామని, డ్రోన్ సేవలు ఫొటోలకు, ఈవెంట్లకే పరిమితం కాకుండా పిఎపి శాంపిళ్లను పంపడం ద్వారా వైద్య సేవలకు ఉపయోగించడం ఆంధ్రప్రదేశ్లో తొలిసారని తెలిపారు. ఆరోగ్యం కేంద్రం నిర్వహణ ▶ 2లో

డ్రోన్‌ను ప్రారంభిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు

చురుగ్గా కాల్వ పూడికతీత పనులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నాగార్జున సాగర్ ప్రాజెక్టు పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని మల్లాయపాలెం మేజర్ కాల్వలో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులు రెండ్రోజులుగా చేపట్టారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కల్లూరి కుసుమ ఆధ్వర్యంలో పెదనందిపాడు మండలంలోని అబ్బినేనిగుంటపాలెం దగ్గర రెండు పొక్లెయినర్లు, ప్రత్తిపాడు మండలంలోని మల్లాయపాలెం సమీపంలో మరో పొక్లెయిన్ ద్వారా పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులు మరో ఐదురోజుల్లో పనులను పూర్తి చేసి మొక్కజొన్న, మిర్చి, పొగాకు పైర్లకు నీరందించాలని భావిస్తున్నారు. పనులను శుక్రవారం టిడిపి మండల అధ్యక్షులు జి.శివరాంప్రసాద్, శేశిరెడ్డి, జనసేన నాయకులు, కొండ నీటి వినియోగదారుల సంఘం వంగిపురం-2 అధ్యక్షులు కె.సదాశివరావు, కె.బుల్లియ్య, కె.శంకర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, పి.వీరారెడ్డి పరిశీలించారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర ట్రెజరర్ పి.నాగరాజు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.ఎన్.మూర్తి శుక్రవారం కలెక్టరేట్‌లోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘ కార్యాలయంలో రోజూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో మంచానికి పరిమితమైన వారికి ఇంటి వద్దకు వచ్చి చేస్తామన్నారు. ఈ ప్రక్రియ జనవరి 1 నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐ.సాయిబాబు, ఎంఎస్.నాగేంద్రరావు, పి.శ్రీనివాసరావు, రమణబాబు, కోటేశ్వరరావు, ప్రసాదలింగం, షేక్.వలి, ఆరాధ్యుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అమరావతి పూర్తయితే షూటింగ్‌లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాజధాని అమరావతి నిర్మాణం పూర్తయిన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో సినిమా షూటింగ్‌లు నిర్వహించుకోవచ్చనే సిఎం చంద్రబాబు ప్రకటనను మూవి ఆర్టిస్టు అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ స్వాగతిస్తున్నట్లు 'మా-ఎపి' వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సినిమాల్లో పనిచేస్తున్న సాంకేతిక నిపుణులకు, నటీనటులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం రూట్ మ్యాప్‌ను విడుదల చేయాలని సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో స్టూడియోల నిర్మాణంపై తగు చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. రైల్వే స్టేషన్, విమానాశ్రమాల సెట్లు ఈ రోజుల్లో అధిక శాతం సినిమాలకు షూటింగ్ నిమిత్తం అవసరం అవుతున్న నేపథ్యంలో వీటిపై దృష్టి పెట్టాలన్నారు. 60 శాతం రెవెన్యూ ఆంధ్రప్రదేశ్ నుండి వస్తుందని తెలిపారు. దీనిపై ఆంధ్రలోనే ఇప్పటికీ నివాసం ఉంటున్న సినిమా పెద్దల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో సహాయ దర్శకులు నరేష్ దోనే, సిహెచ్ మణివరన్ పాల్గొన్నారు.

మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 216 మంది హాజరవగా 26 మందికి సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 190 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించగా 10 అనర్హులయ్యారు. మిగిలిన 180 మంది మహిళా అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన 113 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వీరిలో ఐదుగురే అర్హత సాధించారు. 113 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా 106 మంది అర్హత సాధించగా ఆరుగురు అనర్హతకు గురయ్యారు. మొత్తంగా 190 మందికి పరీక్షలు నిర్వహించగా 106 మంది అర్హత సాధించారు. 84 మంది అనర్హులయ్యారు. పరీక్షలను అదనపు ఎస్‌పిలు సుప్రజ, హనుమంతు పర్యవేక్షించారు.

ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం సాచివేత ధోరణి విడనాడి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలపు ఒప్పందాలకు సంబంధించిన జీవోల సాధన కోసం 10వ తేదీన అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద రిలే దీక్షలు చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. సమ్మె ఒప్పందం ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ఇతర హామీలైన రిటైర్మెంట్ బెన్ఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, అంత్యక్రియలకు ఆర్థిక సాయం, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, జిపిఎఫ్ అకౌంట్లు తదితర హామీలు నెరవేర్చి జీఓలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. సమ్మె ముగిసి ఏడాదవుతున్నా ఇంతవరకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఆర్థిక శాఖలో ఉన్న ఫైళ్లని వెనక్కి తెచ్చి సమస్యలను పరిష్కరించకపోవడం తగదని అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న బదిలీ పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ మస్టర్ కార్మికులుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం నగర కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు పాశం పూర్ణచంద్రరావు, షేక్ బాషా, కిషోర్, షేక్ రసూల్, ప్రసాద్, కంచర్ల కాశయ్య, రాంబాబు, శ్రీనివాసరావు, విజయ్ కుమార్, భూలక్ష్మి, పరమేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

నరసరావుపేట ధర్నాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల వేతనాలు పెంచకుండా, పట్టణ విస్తీరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో పని భారం పెరిగిందన్నారు. యూనియన్ ఇంజనీరింగ్ విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్న అల్లాబక్షు మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్మెంట్ కార్మికుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపుల నేపథ్యంలో ముందస్తు నోటీసు ఇవ్వకుండా, నోటి మాటతో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను నిలుపుదల చేయడం చట్ట విరుద్ధమన్నారు. విధులు నుండి తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సోమశేఖర్ రమేష్ శ్రీను, సామ్రాజ్యం, యోహాను, జీవరత్నం, పి.ఏసు, ఖాసీం, నవీన్, ఆదాం, నాగయ్య, గౌస్ పాల్గొన్నారు.

మంగళగిరిలో..

మంగళగిరి ధర్నాలో సిఐటియు నాయకులు వి.దుర్గారావు, వివి జవహర్లాల్, ఎం బాలాజీ, జెవి రాఘవు మాట్లాడారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని కూటమి హామీనిచ్చిందని గుర్తు చేశారు. మంగళగిరి నుండి గెలిచిన నారా లోకేష్ ఇక్కడి కార్మికుల సమస్యలపై స్పందించాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ విలీన గ్రామ పంచాయతీ కార్మికులకు ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలని, అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.వెంకట్‌రెడ్డి, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, యూనియన్ నాయకులు కె.వెంగమ్మ, బి.క్రాంతి కుమార్, బి.శివకుమారి, సిహెచ్ శివపార్వతి, సిహెచ్ స్వామి, పి.నాగేశ్వరరావు, బి.శివ, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రహ్మానందపురం వార్డు సచివాలయం వద్ద నిరసన

ఆగిన ఎసిసి కార్మికుని గుండె

(మొదటి పేజీ తరువాయి)

చనిపోవడం బాధాకరమని అన్నారు. రోజూ దీక్ష శిబిరం వద్దకు వచ్చి, అందరితో కలిసిమెలిసి తిరిగే నాగేశ్వరరావు ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సరైన వైద్యం పొందలేక మృతి చెందారని ఎసిసి కార్మిక పోరాట సంఘం కన్వీనర్ కూరపాటి స్టీవెన్ ఆవేదన వెలిబుచ్చారు. నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించిన అనంతరం స్థానిక వార్డు సచివాలయం వరకు కార్మికులు, కార్మిక సంఘ నాయకులు ప్రదర్శనగా వెళ్లి సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నాగేశ్వరరావు అంతిమయాత్ర కొనసాగింది. నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు డి.వెంకటరెడ్డి, ఎమ్మెల నరసింహారావు, ఎన్.దుర్గారావు తదితరులు సందర్శించి, నివాళులర్పించారు.

కుటుంబాలు చనిపోతున్నాయి... ఆదుకోండి..

మూడు దశాబ్దాలపైగా తాము పనిచేసిన యాజమాన్యం నుంచి నష్టపరిహారం అందక, ఆర్థిక ఇబ్బందులతో, అనారోగ్యంతో చనిపోతున్న ఎసిసి కార్మిక కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం అందించి, ఆదుకోవాలని వి.దుర్గారావు డిమాండ్ చేశారు. ఎసిసి కార్మికుల 32వ రోజు దీక్షలను శుక్రవారం దుర్గారావుతోపాటు ఎఐఎఫ్‌టియు నాయకులు రాంబాబు ప్రారంభించారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, సిఎం చంద్రబాబు స్పందించాలని, నష్టపరిహారం తక్షణమే చెల్లించేలా జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యాలకు తమ శ్రమ శక్తిని దారపోస్తు, పరిహారం అందక ఇప్పటికే అనేక మంది కార్మికులు చనిపోతున్నా, యాజమాన్యం, పాలక పక్షాలు నిర్లక్ష్యం వహించటం దుర్మార్గమన్నారు. దీక్షలో నాగేశ్వరరావు, సాంబయ్య, అగ్గయ్యా, ఇస్మాయిల్, కృష్ణ కూర్చున్నారు.

20 నుంచి భూముల రీ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

లిఖితపూర్వకంగా వివరాలు తీసుకుని నమోదు చేశారు. అప్పట్లో అనేక వివాదాలు రావడంతో ప్రస్తుతం సర్వేలో వివాదాల పరిష్కారం దిశగా నిర్వహించాలని నిర్ణయించారు. అందువల్ల రోజుకు గరిష్ఠంగా 20 ఎకరాలనే నిర్ణయించారు. దాదాపు 160 రోజుల పాటు సర్వే చేసేందుకు ప్రభుత్వం అధికారులకు గడువిచ్చింది. సర్వే ప్రారంభానికి ముందే స్థానిక రైతులకు పూర్తి సమాచారం ఇవ్వడం, దండోరా, టాంటాం ద్వారా ముందస్తుగా తెలియజేయడం, వారి వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ప్రభుత్వ రికార్డులో ఉన్న వివరాలను సరిచూసుకుని హక్కు పత్రాలను నిర్ధారించనున్నారు. సర్వేకు సంబంధించి ఒక్కో బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, విఆర్ఒ, విఆర్ఎ ఉంటారు. జిల్లాలో మొత్తం 17 మండలాలు ఉండగా తాడేపల్లి, మంగళగిరి మండలాలను మినహాయించారు. ఈ మొత్తం కార్పొరేషన్ పరిధిలోకి చేర్చడం వల్ల కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు సర్వే చేస్తారు. అంతేగాక రాజధాని ప్రాంతం సిఆర్‌డిఎ పరిధిలో ఉండటంతో ఈ మండలాలను మినహాయించారు. ఈ సర్వేలో భాగంగా పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా లచ్చన్నగుడిపూడి, మందపాడు, వడ్డమాను, జడవల్లి, పెరికలపూడి, మంచాల, కాంద్రుపాడు, మెరికపూడి, మల్లాయపాలెం, అనమర్లపూడి, చినపలకలూరు, పెదరావూరు, జొన్నలగడ్డ, కుంచవరం గ్రామాలను ఎంపిక చేశారు.

ఆరోగ్య కేంద్రం నుండి ఎయిమ్స్‌కు డ్రోన్

(మొదటి పేజీ తరువాయి)

తీరుఉపై వైద్యాధికారి అనూషను అభినందించారు. ప్రతిరోజూ 70 మంది వరకు రోగులు వస్తున్నారని, భవిష్యత్తులో ఎమర్జెన్సీ సేవలు కూడా వచ్చే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఒక గైనకాలజిస్ట్ అవసరం ఉందని సూచించగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కె.విజయలక్ష్మి సానుకూలంగా స్పందించారన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మంగళగిరిలో 100 పడకల హాస్పిటల్ బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిందని, త్వరలో శంకుస్థాపన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఎయిమ్స్ హెచ్ఒడి డాక్టర్ ఎ.రాజీవ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి బి.విజయ్‌శేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి బి.కోమలి, ఎమ్‌టిఎంసి అధ్యక్షులు ఎం.వెంకటమారుతీరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

త్వరలో మార్కెట్ నిర్మాణం ప్రారంభం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : అతి త్వరలో పివికె.నాయుడు మార్కెట్ నిర్మాణ పనులు చేపడతామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి జిఎంసి ప్రధాన కార్యాలయంలో పివికె నాయుడు మార్కెట్ నిర్మాణంపై మార్కెట్ వ్యాపారుల సంఘ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సుమారు రూ.152 కోట్ల అంచనాతో 8 అంతస్తులుగా పివికె నాయుడు మార్కెట్ నిర్మాణం చేయడానికి ప్రభుత్వం అనుమతి తర్వాత టెండర్ ప్రక్రియ కూడా ముగిసిందన్నారు. నూతన భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో షుమారు 307 మందికి స్టాల్స్ కేటాయించవచ్చని, వ్యాపారుల సంఘ ప్రతినిధుల వినతి మేరకు ప్రస్తుతం ఉన్న 374 మందికి స్టాల్స్ కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని, వ్యాపారస్తులు ఏ విధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నిర్మాణ సమయంలో వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా ప్రత్యామ్నాయ స్థల సేకరణ చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యంగా, నగరానికి మణిహారంగా పివికె నాయుడు మార్కెట్ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరికీ నూతన భవనంలో పారదర్శకంగా షాప్ కేటాయింపు జరుగుతుందన్నారు. పనులు ప్రారంభించిన 2ఏళ్లలోపు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో మార్కెట్ వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నగరంలోని వివిధ రకాలైన చేతివృత్తిదారులకు నైపుణ్య-సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నగర కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టివి, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటివి మరమ్మతులు చేసేవారు, పెయింటర్, బ్యూటీషియన్ (స్త్రీ, పురుషులు) తదితరులకు తగిన నైపుణ్య, సాంకేతిక శిక్షణ, సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు జీవనోపాధి కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 4వ తేది నుండి 7 వ తేది లోపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిఎంసి ప్రధాన కార్యాలయంలోని మెప్మా విభాగములో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పేరు వివరాలతోపాటు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యార్హత, అనుభవ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటోలు రెండు తదితర వివరాలతో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం మెప్మా మేనేజర్లు వి. మాధవరావు(7780765984), ఎస్.వి.శివనాగేశ్వరి (8309814869), డి.పావని (8309815289)ని సంప్రదించాలన్నారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : వివిధ కేసుల్లో నిందితుడుగా ఉండి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఒక రౌడీషీటరు ఎట్టకేలకు గుంటూరు పట్టాభిపురం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. డిఎస్‌పి జయరాం ప్రసాద్ వెల్లడించిన వివరాలు ప్రకారం రౌడీషీటర్ పాదర్తి రమేష్ అరెస్టుకు కోర్టు ఇప్పటికే నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసిందన్నారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో నమోదైన 4 కేసులలో దీర్ఘకాలంగా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న రమేష్‌ను ఎట్టకేలకు పట్టుకున్నామన్నారు. అయితే మాజీ వైసిపి నాయకుడు పాదర్తి రమేష్ గాంధీ కరోనాతో చనిపోగా ఈ రౌడీషీటర్ చనిపోయాడని కోర్టు కానిస్టేబుల్ నిందితుడు రమేష్‌కు డెత్‌సర్టిఫికెట్ ఇప్పించి కేసుల నుంచి తప్పించేందుకు ప్రయత్నించగా ఈ విషయాన్ని గుర్తించి సంబంధిత కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. కానిస్టేబుల్ రాజుపై నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. తాజాగా అసలు నిందితులు రౌడీషీటర్ పాదర్తి రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు డిఎస్‌పి తెలిపారు. సిఐ వీరేంద్ర బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE AT GUNTUR
O.S.NO. 211/2014

Between:
Mudigonda Srinivasa Rao ... Plaintiff
And
M/s Viswas Real Estate & Infrastructure India Ltd.,, Rep. by its Mg. Director K.Satyanarayana and others ...Defendants

To,
D-09: Vasili Murali Krishna, S/o. Nageswara Rao, R/o. Door No.5-88, Thakkellapadu Village, Pedakakani Mandal, Guntur District.
D-12: Chetti Naga Durga Prasad Rao S/o Satyanarayana, R/o Door No.18-13/A, Lakshmi Narasimha Puram, Vengalayapalem, Ankireddypalem Village, Guntur Rural Mandal,
D-22: V.Murali Krishna S/o Nageswara Rao, R/o Door No.5-88, Thakkekkapadu Village, Pedakakani Mandal, Guntur District
D-23: Shaik Basaida S/o Fareed Saheb, R/o Door No.4-81, Thakkekkapadu Village, Pedakakani Mandal, Guntur District.
D-26: Dentu Punyavathi, S/o.Padmanaba Sastry, R/o.Door No.16-23-163, Janda Chettu Street, Old Guntur, Guntur City.
D-28: Larke Dhanavarma Lakshmi W/o Ramayani Naga Raju, R/o Door No. 21-1-38/B, Back side of Pitta Raghavaiah Rice Mill, Ramalingeswara pet, Tenali, Guntur District.
D-29: Unnam Rowthamam, W/o.Subbaiah, R/o. Door No.7-20-1295, 15th Lane, Sarada Colony, Guntur District.
D-31: Alluri Prathima, D/o.Dandu Ananth Prasad Raju R/o.Flot No.303, Emiliya, Nyathimedos, Kalyani Nagar Pune.
D-32: Veera Hanumataha Rao, S/o.Venkateswara Rao, R/o.Door No.13-2-232, Near Sai Baba Temple, 15th Ward, Macharla, Guntur District.
D-37: Ravi Lakshmi, W/o. Ravi Kumar, R/o.Door No.20-18-165, 11th Lane, D.S. Nagar, Etukuru Road, Guntur City.
D-39: Yaganti Subba Rao S/o Nagaiah, Door No. 7-19/1-490, 2nd lane, Arundathi Nagar, Kothapet, Guntur City
D-40: Kothamasu Hari Babu S/o Bala Koteswara Rao, Door No. 6/15-16, Brodipet, Bhavya Monar, Flat No. E1(501), Guntur.
D-45: Venkayalapati Sai Pawan, S/o. Rattaiah, R/o.Door No.4-5-61, 1st lane, Santhi Nagar, Koretipadu, Guntur City.
D-48: Yenumula Rama Devi W/o Prabhakar Rao, Door No. 6-10-38, 10/2 Arundelpet, Guntur.
D-50: Gaddam Uma W/o Gandhi, R/o Flat No. 310, Block No.B, Pallavai Sudha Homes, Ankireddypalem, Guntur.
D-51: Shaik Khusheed Begum W/o Naguru Vali, R/o Flat No.107, Block No.B, Pllavi Sudha Homes, Ankireddypalem, Guntur
D-57: Battini Swarna Latha, W/o. Srinu, R/o.Door No 7-16,262, 7/3, Sri Nagar, Guntur City
D-69: Tadiboina Sri Kanath, S/o. Samabasiva Rao, R/o.Door No. 4-16-82, 3rd Lane, Bharat Pet, Amaravathi Road, Guntur City.
D-71: Ishrath Jahan w/o Abdul Majeed, aged about 34 years, R/o Door No.18-18-50, Near B.R. Stadium Water Tanks, Mufthi Street, Guntur.
D-72: Shaik Tasleem W/o Abdul Mujahid, aged about 30 years, R/o Door No.18-18-50, Near B.R. Stadium Water Tanks, Mufthi Street, Guntur.

పై నెంబరు దావాలో ప్రతివాదులకు సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాదులు ది. 09-01-2025 ఉ॥గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెనిది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 09-01-2025

యడ్లపల్లి కోటేశ్వరరావు, వాది తరపు అడ్వకేట్, 2/18, బ్రాడీపేట, గుంటూరు సెల్: 9397107449

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని సంస్థల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు.

పరీక్షా భవన్‌లో.. : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న పరీక్షా భవన్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక పూలమాల వేసి నివాళి అర్పించారు. డిఇఒ మాట్లాడుతూ భర్త జ్యోతిరావు పూలే సహకారంతో మహిళా విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలని, నేడు అనేక మంది మహిళలు, ఉపాధ్యాయులుగా ఇతర రంగాల్లో రాణిస్తున్నారంటే సావిత్రిబాయి పూలే కృషే కారణం అన్నారు.

44, 47 సచివాలయంలో.. : స్థానిక సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డులోని 44, 47వ సచివాలయ సిబ్బంది శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే దంపతుల చిత్రపటానికి సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు. పూలే దంపతులు సామాజిక సమస్యలపై ఉద్యమించి, మహిళోద్ధారణకు, స్త్రీ విద్యకు కృషి చేశారని కొనియాడారు.

భీమ్ భారత్ కార్యాలయంలో.. : స్థానిక అరండల్‌పేటలోని బీమ్ భారత్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీమ్ భారత్ మహిళా నాయకురాలు రావినూతల కమలకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం, మహిళల అభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సాధు మాల్యాద్రి, గంట ప్రభుదాస్, వేల్పూరి నరసింహారావు, కైలా జయసుధ, సిఖ సురేష్ పాల్గొన్నారు.

భీమ్‌సేన సేవాదళ్ నివాళి.. : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి బీమ్‌సేన సేవాదళ్, వివిధ సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీమ్ సేన సేవాదళ్ అధ్యక్షులు నల్లపు నీలాంబరం ప్రసంగించారు. కార్యక్రమంలో భారత్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మంచాల జోసఫ్, చార్వాక యువజన సంఘం అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్, నడ కిరణ్, సిహెచ్. వాసు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో.. : సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా స్థానిక చుట్టుగుంటలోని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్, మైనార్టీ నాయకులు నాగులమీరా, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ సివిల్‌జడ్జి (జూ॥డి॥) వారి కోర్టులో
ఇ.పి. నెం. 17/24 ఇన్ ఓ.యస్.నెం. 214/21
పిటీషనర్ / డి.హెచ్ఆర్ : బొడ్డు శ్రీనివాసరెడ్డి
వర్సెస్
రెస్పాండెంట్ / జె.డిఆర్ : రామిశెట్టిరమేష్, తండ్రి సాంబయ్య, సాకిన్ : చెరువుకట్ట బజారు, పిడుగురాళ్ళ.
పై నెంబరులో తన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం డి.హెచ్ఆర్ దాఖలు చేసినందున జె.డిఆర్‌కి నోటీసు నిమిత్తం ది. 10-01-2025న వాయిదా అయివున్నది. సదరు తేదీన జె.డిఆర్ స్వయంగా లేదా తన అడ్వకేట్ ద్వారా పై కోర్టులో ఉదయం 10-30 గం.ల నుండి హాజరులో వుండి తన ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేనియెడల అతని పరోక్షమందు కేసు తీర్మానించబడును.
(బై ఆర్డర్ ఆఫ్ కోర్ట్)
వాయిదా : 10-01-2025
యతిరాజు వెంకటేశ్వర్లు, అడ్వకేట్, పిడుగురాళ్ళ. సెల్ : 7981373694.

బహిరంగ ప్రకటన
షేక్ మస్తాన్ వలి తండ్రి ఖాశిం అను నేను పూర్తి సమాచారంతో జనులకు తెలియజేయునది. నా యొక్క స్థలమునకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ ఉంది. కానీ దానికి సంబంధించిన రెండు లింక్ డాక్యుమెంట్లు నంబర్లు 2484/2009, 7347/ 2010 ను తీసుకుని నా స్వ గృహమైన గణపవరం గ్రామం నుండి మోటార్ సైకిల్‌పై ఫోటోస్టాట్ నిమిత్తం గణపవరం లోనే సెంటరుకు వచ్చి చూసుకొనగా అవి లేవు. ఎక్కడో పడి పోయినవి. ఎంత వెతికినను కనిపించ లేదు. కావున అవి దొరికిన వారు నా అడ్రస్సుకు తీసుకువచ్చి ఇవ్వగలరు. లేదా నా సెల్‌నెంబర్ 7702588537 కు ఫోన్ చేసి అయిన సమాచారం తెలుప గలరు. ఈ ఒరిజినల్ డాక్యుమెంట్లను ఎక్కడ, ఏ బ్యాంకులో తాకట్టు పెట్టలేదని, ఎవరికి హామీ ఉండే విధంగా ఇవ్వ లేదని, దురుద్దేశ పూర్వకముగా ఎవ్వరికిని ఇచ్చియుండలేదని, వాస్తవంగానే పోయినవని తెలియజేయడమైనది. ఇది నా పూర్తి సమ్మతి.
షేక్ మస్తాన్ వలి, తండ్రి ఖాశిం, డోర్ నం. 11-114, గణపవరం గ్రామం, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా సెల్ నం.7702588537.

పత్రికా ప్రకటన
మా క్లైంటు పల్నాడు జిల్లా, వినుకొండ టౌన్, కొత్తపేట నివాసి గోనుగుంట్ల వెంకట సీతారామాంజ నేయులు గారి భార్య లీలావతి, సెల్ : 9849911122 ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియ జేయునది ఏమనగా!
వినుకొండ ఎస్.ఆర్.ఒ నందు నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, హైదరాబాద్, తరుపున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి గోనుగుంట్ల లీలావతి గారి పేర రిజిస్టరు కాబడిన విక్రయ దస్తావేజు ద.నెం. 2094/2011కు లింకు అయిన విక్రయ దస్తావేజు నెం. 485/1991ను మార్కెట్టుకు తన ఇంటి నుండి వినుకొండలోని లాయర్స్ స్ట్రీట్లోని ఫోటోస్టాట్ సెంటరుకు వెళ్ళుచుండగా పోగొట్టుకొనుట జరిగినది. తదుపరి ఈ దస్తావేజు కొరకు వెతికినను కనిపించలేదు. ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల పై తెలిపిన నా అడ్రస్సు కాని లేక మా క్లైంటు అడ్రసుకు కాని వెంటనే అందజేయగలరు.
పి.సైదారావు, బి.కామ్, బి.ఎల్, అడ్వకేట్, లాయర్స్ స్ట్రీట్, కొత్తపేట, వినుకొండ టౌన్, పల్నాడు జిల్లా. సెల్ : 9440825595
saidarao.potluri@gmail.com

వైసిపి సోషల్ మీడియా కో-కన్వీనర్‌పై దాడి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

శివను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

వట్టణానికి చెందిన గురజాల నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా కో కన్వీనర్ ఇర్ల శివ అను వ్యక్తిపై దాడి జరిగిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు ఇర్ల శివ తెలిపిన వివరాల ప్రకారం తాను పట్టణంలోని సెలూన్‌షాపునకు వెళుతుండగా పట్టణానికి చెందిన ఇంతియాజ్, రవి మరి కొంతమంది వ్యక్తులు తనపై దాడి చేశారని, వైసిపికి అనుకూలంగా పనిచేసి నందుకు గాను తనపై దాడి చేశారని, స్థానికులు స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు ఇర్ల శివ తెలియజేశాడు. గతంలో తన తండ్రిని కూడ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళి ఇబ్బందులు పెట్టారని, తన తమ్ముడు మీద కూడ దాడికి యత్నించారని, పోలీసులు గతంలో చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలా తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. జరిగిన ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇర్ల శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టు అనుమతితో కేసు నమోదు చేస్తామని సిఐ వెంకట్రావ్ తెలిపారు.

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

దాడికి గురై ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇర్ల శివను గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇర్ల శివకు న్యాయం జరిగేలే చూస్తామని దాడిని ఖండిస్తున్నామని తెలిపారు.

నకరికల్లులో ఎటిఎం ధ్వంసం

ప్రజాశక్తి - నకరికల్లు

నకరికల్లు గ్రామంలోని అండర్ పాస్ వద్దగల ఇండియా వన్ ఏటిఎంను గురువారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు డబ్బుల కోసం ధ్వంసం చేశారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఏటిఎం స్క్రీను, కీబోర్డ్ మరియు కార్డు రైడర్లను ధ్వంసం చేసి నగదు రాకపోవడంతో అలానే వదిలేసి వెళ్లారని తెలిపారు. గుంటూరు జిల్లా ఇండియా వన్ మెయింటెనెన్స్ మేనేజర్ పోతూరి నాగ పవన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే ఏటీఎంలో సుమారు రెండు సంవత్సరాల క్రితం దొంగతనం చోటుచేసుకుంది.

ఘర్షణపడిన వారికి రూ.ఐదు లక్షల బైండోవర్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రెండు రోజుల క్రితం మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామ పరిధిలో కొట్లాటలకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులను శుక్రవారం సత్ప్రవర్తన నిమిత్తం మంగళగిరి తహశీల్దార్ ముందు హాజరుపరచారు. మంగళగిరి తహశీల్దార్ సదరు వ్యక్తులకు రూ.ఐదు లక్షల బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతు మండల ప్రజలందరూ ఎటువంటి కొట్లాటలకు సంఘ విద్రోహ మరియు అసాంఘిక చర్యలకు పాల్పడరాదని తెలిపారు. దీనిని ఉల్లంఘించిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మరియు పైన తెలిపిన విధంగా అందరికీ బైండోవర్ చేయడం జరుగుతుంది.

ఇంటర్ విద్యార్థులకు నేటి నుండి మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఇంటర్ విద్యార్థుల కోసం 2018లో ఈ పథకాన్ని అమలు చేసింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని నిలిపేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటర్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను ఉచితంగా అందించింది. తాజాగా మధ్యాహ్న భోజన పథకం అమలుకు చర్యలు చేపట్టింది. పల్నాడు జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 139 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ ఇకమీదట మధ్యాహ్న భోజనం అందనుంది.

పదో తరగతి విద్యార్థులకు ఐద్వా ఆధ్వర్యంలో యుటిఎఫ్ స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల కేంద్రమైన నాదెండ్లలోని జెడ్‌పి పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ సహకారంతో స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 50 మందికి మెటీరియల్‌ను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐద్వా నాయకులు చాగంటి అమరమ్మ, జగన్నాథమ్మ మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి సావిత్రి బాయి పూలేను చేసిన సేవలను వివరించారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు పట్టుదలతో చదవాలని సూచించారు. యుటిఎఫ్ అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నిర్మల, శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి - రెంటచింతల

బాల్య వివాహాలు సమాజానికి చేటని, అనారోగ్య సమస్యల వల్ల యువతుల ఆయుష్షు కుంగిపోతుందని ఐసిడిఎస్ రెంటచింతల-2 సెక్టార్ సూపర్వైజర్ నాగమణి అన్నారు. కిశోరి వికాసం ఆర్యక్రమంలో భాగంగా మండంలోని తుమ్మకోట జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతోపాటు చట్టాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులందరూ మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాలకు నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో ధర్నా చేస్తున్న కార్మికులు



దాచేపల్లిలో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కనీస వేతనం, ఉద్యోగ భద్రత కోసం ధర్నాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిడుగురాళ్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద, దాచేపల్లిలోని నగర పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నాలు చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా ఇంజినీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 11వ పిఆర్‌సి ప్రకారం వేతనాలు అమలు చేయాలని, పండగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎలాంటి నిబంధనా లేకుండా ఇంజినీరింగ్ కార్మికుల అమలు చేయాలని, యూనిఫామ్ సబ్బులు, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కార్మికులు షేక్ సుభాని, గద్దె శ్రీనివాసరావు, విజయ్, కోపూరి రమేష్, గాలి పవన్, కాంద్రగుంట రాజు, ఎన్.సురేష్, ఎస్‌కె మాబు సుభాని, పి.వెంకయ్య, లక్ష్మి, రాజేశ్వరి, వై.శ్రీను, నరేష్, సైదారావు, కోటయ్య, ఎ.నాగేశ్వరరావు, వెంకటేష్, టి.సైదారావు పాల్గొన్నారు.

ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిమెంట్ పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన భూముల్లో వెంటనే సంబంధిత పరిశ్రమలను ప్రారంభించాలని, లేనియెడల రైతులకు సాగుకు అవకాశం ఇవ్వాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏర్పాటైన పరిశ్రమల్లో భూములిచ్చిన రైతు కుటుంబాల్లోని వారికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సిమెంటు యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని కోరారు. నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలో ఖనిజాలు ఎక్కువని, ప్రధానంగా సున్నపు రాయి, నాపరాయి, ముగ్గురాయి ఇక్కడ లభిస్తాయని చెప్పారు. కృష్ణానది పక్కనే ఉండటం.. పరిశ్రమలకు అనువుగా ఉండటంతో కెసిపి, సాగర్, శ్రీచక్ర, చెట్టినాడు, భవ్య, శ్రీ సిమెంటు, పరాశక్తి, సిమెంటు కంపెనీలు ఉత్పత్తి సాగిస్తున్నాయని తెలిపారు. ఈ కంపెనీలన్నీ భూములిచ్చిన రైతులకు నామ మాత్రపు ఉద్యోగాలిచ్చి, ఈ ప్రాంతం నుంచి రూ.వందల కోట్ల లాభాలను దండుకుంటున్నాయని విమర్శించారు. వీటితో పాటు సంఘీ, సరస్వతి, అంబుజా, మై హోం, ఇమామి, రాజపుష్ప సిమెంటు పరిశ్రమల యాజమాన్యాలు గత 15-20 ఏళ్లకుపైగా పరిశ్రమలు ప్రారంభిస్తామని నమ్మబలికి, ప్రభుత్వ అండతో పల్నాడు ప్రాంతంలో 10 వేల ఎకరాలకు పైగా భూములను రైతుల నుంచి నామమాత్రపు ధరకు స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు. పరిశ్రమలో వచ్చే ఉద్యోగాల ద్వారా అయినా తమ కుటుంబాలు బాగుపడతాయన్న నమ్మకంతో రైతులు భూములిచ్చారని గుర్తు చేశారు. పరిశ్రమలు పెట్టకపోవడంతో ఆయా భూములు అడవులను తలపిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం, యాజమాన్యాలు స్పందించకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ప్రజల, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రాధాన్యం

రెవెన్యూ సదస్సుల ముగింపులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిసాయి. సత్తెనపల్లి పట్టణం, వడ్డవల్లి ఆంజనేయస్వామి గుడి వద్ద శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కార దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజల, ప్రభుత్వాస్తుల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ చక్రవర్తి, టిడిపి నాయకులు వై.రామస్వామి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నీటి పథకాలన్నింటినీ వినియోగంలోకి తేవాలి

ఇంటింటికీ రక్షిత నీరు అందించేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల పురోగతిపై తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. నిధుల వినియోగంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమవగా పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. రక్షిత నీటి పథకాలు మూలన పడి ఉంటే కారణాలు తెలపాలని, వాటన్నింటినీ వినియోగంలోకి తేవాలని చెప్పారు. తాగునీటి సమస్యపై వేసవికి ముందే దృష్టి సారించాలన్నారు.

ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

వ్యాపారుల పరిస్థితి బాగోలేదు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ముఖ్యమంత్రి నారా చంద్రబాబును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో పాటు టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి అత్తులూరి సుబ్బారావు (మిస్టర్ గ్రాండ్ సుబ్బు) వెలగపూడి సచివాలయంలో శుక్రవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కోటప్పకొండ త్రికోటేశ్వరుని చిత్ర పటాన్ని సిఎంకు బహుకరించారు. ఆన్లైన్ వ్యాపారం వల్ల మధ్య తరగతి వ్యాపారాల పరిస్థితి బాగోలేదని, కార్పొరేట్ కంపెనీలు, మాల్స్ రావడంతో రెడీమేడ్, కిరాణా, క్లాత్ ఇలా ఎక్కువ శాతం మధ్య తరగతి వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని సిఎంకు చెప్పారు. ప్రభుత్వం తరుపున వ్యాపారస్తులకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీ బెల్లంకొండ అనిల్ పాల్గొన్నారు.

కేన్సర్‌కూ ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ఉచిత వైద్యం

వినుకొండ ప్రభుత్వాస్పత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఒక్కొక్కరికి రూ.25 లక్షల విలువైన వైద్య సేవలు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారని, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా అందులో కవరేజ్ ఉంటుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రంలో ఏటా 70 వేల కొత్త కేన్సర్ కేసులు, 40 వేల వరకూ మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒమేగా కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా నోటి, గర్భాశయ, బ్రెస్ట్ కేన్సర్ పరీక్షల కోసం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ఏటా లక్షలమంది కేన్సర్‌కు బలవడం బాధాకరమన్నారు. ఏ కేన్సర్ అయినా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయ స్థితి నుండి బయట పడవచ్చని, అందుకే ప్రతి మహిళ కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లోనూ ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయాలని ఒమేగా యాజమాన్యం, వైద్యుల్ని కోరారు. త్వరలో రాజధాని అమరావతిలో బసవతారకం కేన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నారని, దాంతోబాటు ఒమేగా లాంటి ఆసుపత్రి ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోనూ కేన్సర్‌కు నాణ్యమైన వైద్యం, ఔషధాలు అందిస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రభుత్వ పరంగానూ ప్రోత్సహించాలని, రైతులు కూడా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పండించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా దిగుబడులు తక్కువ వచ్చినా మంచి ధర లభిస్తుందని ఎమ్మెల్యే చెప్పారు.

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ

హక్కులను రక్షించాల్సిన అధికారులే ఉల్లంఘన

మూడో రోజుకు చేరిన పంచాయతీ కార్మికుల నిరసన దీక్ష

సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి - చేబ్రోలు

కార్మిక చట్టాలను అమలు చేయవలసిన పంచాయతీ అధికారులే చట్టాలను ఉల్లంఘించారని, అక్రమంగా తొలిగించిన పంచాయతీ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలిని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం చేబ్రోలులోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.అక్రమంగా జనవరి 1వ తేదీ నుండి తొలగించిన 12మంది పంచాయతీ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినదించారు. మూడవరోజు కొనసాగుతున్న కార్మికుల దీక్షలను ఉద్దేశించి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కార్మికుల పోరాటం కొనసాగుతున్న అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనేక సంవత్సరాలుగా ఎటువంటి రిమార్కు లేకుండా పనిచేస్తున్న కార్మికులను ఇస్టానుసారంగా తొలగించడం అధికారుల బాధ్యతరాహిత్యానికి నిదర్శనం అని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికుల్ని తొలగించాలనే ఆలోచన చేయడం వారి పెత్తనం దారి తనానికి నిదర్శనమన్నారు. పవన్ కళ్యాణ్ మంత్రిగా ఉన్న శాఖలోనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం వెనక ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీను మాట్లాడుతూ సమస్య పరిష్కరించాల్సిన అధికారులు, పోలీసులను ఆశ్రయించడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కార్మికులపై ఏమాత్రం ప్రేమ ఉన్న, కార్మిక చట్టాలపై గౌరవం ఉన్నా తక్షణమే అక్రమంగా తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేబ్రోలు సెంటర్ నుండి మండల ప్రజా పరిషత్ కార్యాలయం కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ఎండిఓ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం కార్మిక సంఘాల నాయకులకు, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో చర్చలు జరిగినప్పటికీ చర్చలు సఫలం కానందున ఆందోళన కొనసాగుతుందని నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ హనుమంతరావు , సిఐటియు మండల కార్యదర్శి రమేష్ బాబు, సిఐటియు నాయకులు ఆదిశేషయ్య, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మరియదాసు దివ్యశ్రీ, నాగేశ్వరమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు ఎన్టీఆర్ సెంటర్‌లో ఆందోళన చేపట్టిన కార్మికులు, నాయకులు

కెఎస్ లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు, కృష్ణ జిల్లాల పట్టభద్రుల నియోజవర్గానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. శుక్రవారం రాత్రి మంగళగిరి ప్రజాసంఘాల కార్యాలయంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కే ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ నిరుద్యోగ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి యు దుర్గారావు అధ్యక్ష

మాట్లాడుతున్న ఈమని అప్పారావు

వహించారు. ఎమ్మెల్సీగా కెఎస్ లక్ష్మణరావు అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలోనూ, ప్రజా ఉద్యమంలోనూ పని చేశారని అన్నారు. బయట ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు మద్దతుగా శాసనమండలిలో మాట్లాడతారని అన్నారు. అనేక రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఘనత లక్ష్మణరావుకే దక్కుతుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. లక్ష్మణరావు గెలుపుకు ప్రతి ఒక్కరు విషయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు టి ఆంజనేయులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు వి వి జవహర్లాల్, పి బాలకృష్ణ, జెవి రాఘవులు, ఎం రవి, ఎం బాలాజీ, వై కమలాకర్, ఎం నాగేశ్వరావు, టి శ్రీరాములు, పి రామచంద్ర రావు, బి కోటేశ్వరి, ఎస్ గణేష్, ఎం రాంబాబు, ఎం చలపతిరావు, కే పాములు, టీ ప్రసాద్ రెడ్డి, టి శ్రీనివాసరావు, ఎస్ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు యుటిఎఫ్ సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని యుటిఎఫ్ మంగళగిరి పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు మహిళా ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సీకె హైస్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఏవీఎస్ వరలక్ష్మి, కుప్పురావు కాలనీ మున్సిపల్ ప్రైమరీ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యా యురాలు కే నిర్మలలను ఆయా హైస్కూల్లో ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు సైదా నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే గౌరవార్థం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నా మన్నారు. ప్రధానోపాధ్యా యురాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీమతి వరలక్ష్మి, కె నిర్మల లను సన్మానించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పట్టణ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్ వి శివరామిరెడ్డి, కోశాధికారి ఎస్కే రహమాన్, జిల్లా నాయకులు ఎం కోటిరెడ్డి, నాయకులు ఎస్ కె లక్ష్మీప్రసన్న, యు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన యుటిఎఫ్ నాయకులు

టిజెపిఎస్ కాలేజీలో సైన్స్ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు సైన్స్‌క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జరిగిన సభలో విద్యార్థులను ఉద్దేశించి కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి వున్న సజనాత్మకతను వెలికి తీయటానికి ఈక్విజ్ పోటీలు దోహదం చేస్తాయని, పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లే జ్ఞానాన్ని అందిస్తాయని చెప్పారు.ఈ పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా శ్రీ వెంకటేశ్వరా బాలకుటీర్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతి సాధించారు. వీరికి రూ.2వేలు నగదు బహుమతి అందచేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డిగ్రీ ఇంచార్జ్ భానుమురళి, సైన్స్ క్విజ్ కన్వీనర్ జి సురేష్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ జె వి సుధీర్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల సెక్రెటరీ కెవి బ్రహ్మం

సిఐటియు నాయకులు శామ్యూల్ కన్నుమూత

సిపిఎం, ప్రజాసంఘాల నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

శామ్యూల్ (ఫైల్‌ఫొటో)

బాపట్ల వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన సిఐటియు బాపట్ల పట్టణ కార్యదర్శి జంగం శామ్యూల్ (45)కు సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల మార్చురీ వద్ద శామ్యూల్ భౌతిక ఖాయాన్ని సిపియం, సిఐటియు నాయకులు సందర్శించి, పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ శామ్యూల్ వివిధ రంగాల కార్మికుల సమస్యలపై పోరాటం చేశాడన్నారు. బాపట్ల ప్రాంతంలో ఆర్.డబ్ల్యూ.ఎస్‌లో పనిచేస్తూ అక్కడ యూనియన్‌ని ఏర్పాటు చేసి, కార్మికుల సమస్యలపై కృషి చేశాడన్నారు. తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘంలో, సిఐటియులో పూర్తికాలం కార్యకర్తగా పనిచేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాడన్నారు. ఆర్టీసిలో ఉద్యోగం వచ్చిన తర్వాత బాపట్ల డిపోలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడని తెలిపారు. ఉద్యోగిగా ఉన్నప్పటికీ వివిధ రంగాల కార్మికుల సమస్యలపై స్పందించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాడన్నారు. శామ్యూల్ అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందటం ఉద్యమానికి తీరని లోటని అన్నారు. శామ్యూల్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. నివాళి అర్పించిన వారిలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్‌ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పి రామారావు, ఈమని అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు బి లక్ష్మణరావు, బి ముత్యాలరావు, కె కృష్ణకాంత్, నాయకులు కె శ్రీనివాస్, ఎం భాగ్యరాజు, నవీన్‌ప్రకాష్, ఎ నికల్సన్, ఖాసిం షహీద్, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

ప్యార్లిపాడులో నేడు అంత్యక్రియలు

బాపట్ల పట్టణ సిఐటియు కార్యదర్శి మరియు ఆర్టీసీ యూనియన్ నాయకులు జంగం శామ్యూల్ శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఉదయం 10 గంటలకు స్వగ్రామం బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం ప్యార్లిపాడు గ్రామంలో నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

గుంటూరులో శామ్యూల్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ తదితర నాయకులు

దేశ సమైక్యతను దెబ్బతీసే బిజెపిని వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కేంద్రంలో బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సమైక్యతను దెబ్బతీసే విధంగా, కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపిని వ్యతిరేకించాలని, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం, బొగ్గిళ్ళలో భారత రాజ్యాంగాన్ని కాపాడాలి, మతసామరస్యాన్ని కాపాడాలి అని కోరుతూ సిపిఎం శ్రేణులు కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చి మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతుందని ఆయన అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవహేళన చేసే విధంగా, మాట్లాడిన అమిత్ షా వ్యాఖ్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఖండించకపోవడం, బిజెపి దుర్మార్గ పాలనకు అద్దం పడుతుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపిని వ్యతిరేకించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి శాస్త్రి, నీరుడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు : నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శుక్రవారం పెదనందిపాడులో కరపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ దేశ సమైక్యత మతసామరస్యం వెల్లివిరియాలి. స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, ప్రగతి బాటలో ముందడుగు వేయాలి. అనే నినాదంతో ఈ కరపత్రాలు పంపిణీ జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు జంపని రామారావు, మర్రి లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో మంగళగిరి

ప్రజాశక్తి-మంగళగిరి

ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ, నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకువెళ్లేందుకు మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల వైసిపి నుండి జనసేన పార్టీలోకి వచ్చిన మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని జనసేన నాయకులకు పరిచయం చేశారు. అనంతరం చిల్లపల్లి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి చిరంజీవి జనసేన పార్టీలోకి చేరాలని అన్నారు. గంజి చిరంజీవి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ వంద పడకల ఆసుపత్రిని నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం మంచి పరిణామాన్ని అన్నారు.కూటమి మంచి పనులు చూసి జనసేనలో చేరానని ఆయన తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ శేఖర్, బోడే కోమలి, మునగపాటి వెంకట మారుతిరావు, జనసేన పార్టీ మైనార్టీ నాయకులు షేక్ సుభాని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిల్లపల్లి, గంజి చిరంజీవి

మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాల్సిన అవసరం ఉందని పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మోహన్, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాధాకష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యాదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ రైతు, రైతు కూలీల సంక్షేమం కోసం ఏకకాలంలో మంచి నిర్ణయాలు తీసుకున్న ప్రధానమంత్రిగా మన్మోహన్ చరిత్ర పుటలకు ఎక్కారన్నారు. ఎన్నికలలో ఎలాంటి హామీ ఇవ్వకుండా రైతులకు 72 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం, మ హాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టి వ్యవసాయ కూలీల ను ఆదుకోవడం వంటి చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. అనంతరం మన్మోహన్ సింగ్ కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని సభలో ప్రతిపాదన చేయగా.. అందరూ ఆమోదించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు టి.బాబూరావు, లోక్‌సత్తా రాష్ట్ర కమిటీ సభ్యులు మాదాసు భాను ప్రసాద్, విసీకే పార్టీ జిల్లా కార్యదర్శి వంజా ముత్తయ్య, రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ అధ్యక్షుడు షేక్ గౌస్, సీ మాంధ్ర సాధన సమితి అధ్యక్షులు అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, తదితరులు

కష్టజీవుల కరదీపిక ప్రజాశక్తి

ప్రజాశక్తి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కష్ట జీవుల పక్షాన నిలిచిన పత్రిక ప్రజాశక్తి అని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని టిడిపి కార్యాలయంలో ప్రజాశక్తి రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే శు క్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల పక్షాన నిలబడి, వారి కష్టసుఖాలు తెలుసుకుని సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రజాశక్తి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాశక్తి పనిచేస్తోందని, నిష్పక్షపాతంగా వార్తలను వెలువరిస్తూ, ప్రజలకు, పాలకులకు వారధిగా ఉందని అన్నారు. ఈ కృషిని మరింత ముందుకు తీసుకెళ్తూ మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. టిడిపి సీనియర్ నాయకులు గుత్తా అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పట్టున్న పత్రిక ప్రజాశక్తి అన్నారు. ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదాన్ని నిజం చేస్తూ వాస్తవాలను ప్రచురించే నైజం ప్రజాశక్తికే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి నరసరావుపేట డివిజన్ ఇన్‌ఛార్జి జి.ప్రేమసాగర్, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి ఎం.ఆంజనేయులు, విలేకర్లు పి.బుజ్జిబాబు, షేక్ మస్తాన్ వలి, టిడిపి నాయకులు ఉడతా రాఘవ పాల్గొన్నారు.



మహిళా అభ్యున్నతికి మార్గదర్శి సావిత్రిబాయిపూలే

ప్రజాశక్తి- మాచర్ల

మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి సావిత్రిబాయి పూలే అని దళిత బహుజన భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జారి అన్నారు. శుక్రవారం మాచర్ల ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళిత సీనియర్ నాయకులు మాచర్ల రామారావు, కుక్క ముడి జాన్, యాకోబు, నాదెండ్ల దశరథ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో వేడుకలు

సత్తెనపల్లి: మహిళోద్ధరణకు పాటుపడిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు జ్యోతిరావు పూలే అని ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని అన్నారు. స్థానిక పుతుంబాక భవన్ లో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ మాట్లాడుతూ మహిళలకు చదువు నేర్పిన మొదటి మహిళా టీచర్ జ్యోతిరావు పూలే అని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షులు మునగా జ్యోతి, ఉపాధ్యక్షురాలు డి.విమల, ఇంజం అరుణ, జె.మరియమ్మ, సాయి, పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయ్ కుమార్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు గద్దె చలమయ్య, చేనేత కార్మిక సంఘం నాయకులు కట్ట శివ దుర్గారావు, వీరబ్రహ్మం, పంతంగి ప్రభాకర్, పులిపాటి రామారావు, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూరి ప్రకాష్‌రావు, ఆవాజ్ సంఘం నాయకులుషేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి :నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని పల్నాడు బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులకు ఘనంగా సన్మానించారు.

సత్తెనపల్లి : పట్టణంలోని 5వ వార్డు ప్రాథమిక పాఠశాలలో బీసీ సంఘ నాయకులు ప్రత్తిపాటి హరేకష్ణ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. అనంతరం 70 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

డాక్టర్ సాంబేలు శాంతిబాయికి పూలే జాతీయ అవార్డు

ప్రజాశక్తి -విపిసౌత్ : విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియర్‌లో భారత చైతన్య పార్టీ ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన హిందీ ఉపాధ్యాయిని డాక్టర్ సాంబేలు శాంతిబాయిని సీనియర్ సినీ నటులు, పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందం, రేణు దేశాయ్, రామచంద్ర యాదవ్, ఢిల్లీ ప్రొఫెసర్లు సత్కరించారు. పూలే జాతీయ అవార్డును బహూకరించారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతిని ఇంగ్లిష్ మీడియం- విద్యా పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్‌ఎం ధనలక్ష్మి, సీపీఎం నాయకులు శ్రీనివాస్, సీపీఐ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల : పట్టణంలోని కెఎన్‌ఆర్ విద్యా సంస్థల పి.ఎస్.ఆర్ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. విద్యా సంస్థల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్‌రావు తదితరులు పాల్గొని.. మహిళా ఉపాధ్యాయులు కోనేటి ప్రసన్న, షేక్ రజియా, బి.ఇందులను ఘనంగా సత్కరించారు.

వినుకొండ : నియోజకవర్గం బీసీ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పల్నాడు రోడ్ లోని డాక్టర్ చలపతిరావు హాస్పిటల్ వద్ద సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాయర్ సిద్ధయ్య, పి.సైదారావు, డాక్టర్ చలపతిరావు, అనుముల ప్రసాదరావు, మల్లాది సాంబశివరావు

పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సెయింట్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వంకాయలపాటి రవి, దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్, టిడిపి నాయకులు మడక శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పలు విద్యాలయాల్లో, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ చిత్రాలు ఇక్కడ చూడొచ్చు..

మిరప పంటలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం రాయవరం, తాళ్లపల్లి గ్రామాల్లోని మిరప పంట పొలాలను మాచర్ల ఉద్యాన అధికారి సురేష్ శుక్రవారం పరిశీలించారు. నల్ల తామర పురుగు నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎకరాకు 200 కేజీల వేప పిండి భూమిలో వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా తగు సస్యరక్షణ చర్యలను వివరించారు. ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జెస్సీరాజ్‌ను అభినందించిన మంత్రి లోకేశ్

ప్రజాశక్తి-మంగళగిరి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్-2025 అవార్డు అందుకున్న గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీ రాజ్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అభినందించారు. జెస్సీరాజ్ తన కుటుంబ సభ్యులతో కలసి ఉండవల్లిలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. స్కేటింగ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి బాలపురస్కార్ అవార్డు అందుకున్న ఆమెను మంత్రి అభినందించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

పింఛన్‌దారులు జీవన ధ్రువపత్రాలను సమర్పించాలి

ప్రజాశక్తి-దుగ్గిరాల

పెన్షన్ పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు.. ఫిబ్రవరి నెలలోగా తమ జీవన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని దుగ్గిరాల ఎస్‌టీవో ఒ.మస్తాన్ గుంషావలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ట్రెజరీ కార్యాలయంలో గానీ, జీవన ప్రమాణం పోర్టర్ యాప్‌లో గానీ నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, మొబైల్ నంబరు(ఓటీపీ కోసం), పెన్షన్ పుస్తకం, బ్యాంకు ఖాతా నెంబర్ వివరాలు తీసుకొని ట్రెజరీ, ఇంటర్నెట్ సెంటర్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్డు ఈద్గా వద్ద శుక్రవారం నూతనంగా ఏక్యూబ్ ఫిట్నెస్ సెంటర్‌ను టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. వ్యాయామంతోనే ఆరోగ్యమని.. మారుతున్న పరిస్థితులను బట్టి అత్యాధునికమైన పరికరాలతో ఫిట్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

రెవెన్యూ సదసుల్లో 39 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని ఫిరంగిపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 39 అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి చౌర్యంపై కమిషనర్ ఆరా

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అనధికార మంచినీటి కుళాయిలను రెగ్యులర్ కనెక్షన్‌గా మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. తెనాలి పట్టణంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. పలు బహుళ అంతస్తుల సముదాయాల్లో అనధికార మంచినీటి కుళాయి కనెక్షన్లను గుర్తించి, ఆరా తీశారు. తప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై మున్సిపల్ యాక్ట్ 1965, సెక్షన్ 332 ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి

ప్రజాశక్తి-మంగళగిరి

అంటరానితనం, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన తగొప్పసంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయి పూలే అని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ కొనియాడారు. శుక్రవారం సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పలువురు బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న తన భర్త మహాత్మ జ్యోతిబాపూలే వద్ద ఓనమాలు దిద్ది, ఉన్నత విద్య నభ్యసించి, మహిళలకూ చదువు అవసరమని కంకణం కట్టుకున్న తొలి భారతీయ ఉపాధ్యాయిని అని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు డాక్టర్ ఉప్పాల శివలక్ష్మి, గంజి లక్ష్మి, కె.సుష్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకురాలు స్వాతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి

పెదనందిపాడు: సావిత్రిబాయి పూలే జయంతిని పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ.. మహిళలకు విద్య ద్వారానే విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె.. భర్త జ్యోతిరావు పూలే తో కలిసి మహారాష్ట్రలోని పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. కులతత్వం, పురుషాధిక్య ధోరణులను నిరసించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, సభ్యులు మర్రి లక్ష్మి, గుగ్గిలం సాయిబాబు, కుట్టు శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

చేబ్రోలు : సావిత్రిబాయిపూలే సేవలు ఎనలేనివని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు అన్నారు. పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కె.అరుణ జ్యోతిని సత్కరించారు.

ఫిరంగిపురం : మండలంలోని పొనుగుపాడు గ్రామం జడ్పీహెచ్‌ఎస్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం సాంబశివరావు, సిపిఎం నాయకులు, పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్‌కె మస్తాన్‌వలి, జ్యోత్స్న మేరి, ఆదిలక్ష్మి శైలజ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే సేవలను గుర్తు చేసుకున్నారు.

తెనాలిరూరల్ : స్త్రీ జనోద్ధరణకు, మహిళా విద్యకు తన జీవితాన్ని అంకితం చేసిన సావిత్రిబాయి పూలే చిరస్మరణీయులని బిసి సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని బిసి సంఘ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంటూరు : స్థానిక టిజెపిఎస్ కాలేజి మహిళా విభాగం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలె జయంతి నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విఆర్ జోత్స్న కుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో టిజెపిఎస్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవిచ, కళాశాల సెక్రటరీ కె.వి.బ్రహ్మం, అధ్యాపకులు ఆర్.జయశైలజ, బి.జ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎఎన్‌యు : సావిత్రిబాయి జయంతిని నాగార్జున విశ్వ విద్యాలయం - మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర రావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తి రావు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన రాయపాటి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం చంద్రబాబు నాయుడును మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు, ఆయన సోదరుడు రాయపాటి శ్రీనివాస్ శుక్రవారం ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు చేస్తున్న కృషికి అభినందించినట్లు రాయపాటి సాంబశివరావు తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి నిలిచిపోయిందని, ఇప్పుడు మళ్లీ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా రాయపాటి ఆరోగ్య పరిస్థితులను చంద్రబాబు అడిగి తెలుసుకొన్నారు.

యథేచ్ఛగా ఖాళీ స్థలాల ఆక్రమణ

- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - తాడికొండ

మండల కేంద్రమైన తాడికొండలో కొంతమంది ఖాళీ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారని.. తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మంచినీటితోపాటు, పారిశుద్ధ్య సమస్య వేధిస్తోందన్నారు. బీసీ హాస్టల్ వద్ద ఓ వ్యక్తి అక్కదేవతల చెరువును ఆక్రమించి ఇల్లు నిర్మిస్తుండగా.. పంచాయతీ అధికారులు అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మంగళగిరికి చెందిన ఓ వ్యక్తి కొండ పక్క స్థలాన్ని ఆక్రమించడానికి గత ప్రభుత్వ రాజకీయ నాయకులు, పంచాయతీ అధికారి సహకరించారని.. ఇంటి పన్ను, కరెంటు కూడా ఇచ్చారని.. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ దృష్టికీ తీసుకెళ్లామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీపీవో సాయికుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ సాయి లీల, పంచాయతీ కార్యదర్శి గొట్టం హరిబాబు, సర్పంచ్ తోకల సరోజిని, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

19 వాహనాలు సీజ్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం, మహానాడులో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో డి.ఎస్.పి మురళీకష్ణ, తాడేపల్లి పోలీస్ స్టేషన్ సిఐ కళ్యాణ్ రాజు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం రాత్రి 80 మంది సిబ్బందితో సీతానగరం, మహానాడు ప్రాంతాలలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పత్రాలూ లేని 19 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తాడేపల్లి పోలీస్ స్టేషన్ సిఐ కళ్యాణ్ రాజు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-దుగ్గిరాల

పరీక్షలు బాగా రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం సంఘసంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మంత్రి నారా లోకేష్ పంపించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్నారై జంపాల సుబ్బారావు, వి.శ్రీకృష్ణప్రసాద్, గద్దె శ్రీనివాస్, కాకా బాబు, నక్క చిరంజీవి, బాబూరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతోనే విజయం

ప్రజాశక్తి-దుగ్గిరాల

క్రమశిక్షణ, పట్టుదలే విజయానికి దగ్గర మార్గాలని ప్రముఖ మానసిక వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు విద్యార్థులకు సూచించారు. పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడమే తల్లిదండ్రులకు ఇచ్చిన గొప్ప బహుమతి అని తెలిపారు. దోస్త్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దుర్వ్యసనాలకు లోను కాకుండా మంచి క్రమశిక్షణతో చదివి విజయాలు సాధించడానికి మెలకువలు తెలిపారు. పరీక్షలు రాయడానికి భయపడవలసిన అవసరం లేదని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.బాలసుందరం, ఎస్.శోభాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-దుగ్గిరాల

బాల్య వివాహాలను అరికట్టడం.. నేటి బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం అందరి బాధ్యతని ఇన్చార్జి ఎంపీపీ జబీన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోరీ వికాసంపై మండల స్థాయి శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. కిశోరీ బాలికలు రక్తహీనత బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని.. వారి చదువును ప్రోత్సహించి, ఉపాధి అవకాలు అందిపుచ్చుకునేలా చూడటం మన అందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కేశంనేని అనిత, జి.సరిత, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ జవహర్‌లాల్ నెహ్రూ, ఏపీఎం సురేష్ కుమార్, డీసీపీ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎన్.భవానీ, ఎం.వాణి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులకు పిఎఫ్ లోన్లు మంజూరు చేయాలి

కమిషనర్‌కు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ ఉపాధ్యాయులకు పిఎఫ్ లోన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు యుటిఎఫ్ నాయకులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గత 4 సంవత్సరాలుగా పిఎఫ్ లోన్లు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నారని, ఇటీవల కొంతమందికి మంజూరు చేశారని, మిగిలిన వారికి కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా అవసరం అయిన పాఠశాలలకు బోధనేతర సిబ్బందిని కేటాయించాలన్నారు.సమస్యపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.కమిషనర్‌ను కలిసిన వారిలో యుటిఎఫ్ నగర అధ్యక్షులు ఎం.చిన్నయ్య, జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, డి.చంద్రశేఖర్, యం.శివన్నారాయణ, ఎన్.బి.తిలక్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న వర్సిటీ వీసీ, తదితరులు

జాతీయస్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్ విజేత విజ్ఞాన్స్ వర్సిటీ

ప్రజాశక్తి-గుంటూరు

విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో 18వ ఎడిషన్ మహోత్సవ్-2కె25లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్ విజేతగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ నిలిచింది. వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నరసరావుపట ఇంజినీరింగ్ కళాశాలపై విజ్ఞాన్స్ యూనివర్సిటీ జట్టు 25 పరుగుల తేడాతో గెలిచి చాంఫియన్స్‌గా నిలిచింది. 18వ ఎడిషన్ మహోత్సవ్-2కె25లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో పాటు విన్నర్‌కు రూ.50వేలు, రన్నర్‌కు రూ.30వేలు, మూడో స్థానంకు రూ.20వేలు, నాలుగో స్థానంకు రూ.10వేలు నగదు బహుమతులను అందజేస్తారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ డైరక్టర్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ప్లానింగ్‌పై వర్సిటీలో అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్మెంట్ విద్యార్థులకు టూరిజం పై మోటివేషన్ అండ్ కెరీర్ ప్లానింగ్ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ ఫౌండర్ హెడ్, రిటైర్డ్ ప్రొఫెసర్ వి.వి.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ పర్యాటక ఆతిధ్య రంగాలలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, క్రమశిక్షణతో పాటు కమ్యూనికేషన్, టెక్నాలజీ పరంగా మంచి స్కిల్స్ నేర్చుకోవాలని తెలియజేశారు. టూరిజం రంగం అంతా స్కిల్స్ పై ఆధారపడి ఉందని తగిన స్కిల్స్ ను విద్యార్థులు స్టడీస్‌లో నేర్చుకోవాలని, శిక్షణ పొందాలని తద్వారా మాత్రమే మంచి ఉద్యోగాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్ టికెట్ బుకింగ్ స్కిల్స్ కంప్యూటర్ స్కిల్స్, గైడింగ్ అండ్ టూర్ మేనేజింగ్ స్కిల్స్ తదితరాలు అభ్యసించాలన్నారు. టూరిజం అండ్ హాస్పిటలిటి విభాగాధిపతి ప్రొఫెసర్. పి. పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ ప్రొఫెసర్ వి.వి.ఎల్.నరసింహారావు టూరిజం అండ్ హాస్పిటలిటీ మేనేజ్మెంట్ విభాగం ఫౌండర్‌గా ఎనలేని సేవలు అందించారని, అలాగే ఈ విభాగం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం ప్రొఫెసర్ నరసింహారావును సన్మానించారు. డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ రచించిన టూరిజం మార్కెటింగ్, టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అను రెండు పుస్తకాలను ఆయనకు బహుకరించారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు, సీనియర్ ఫ్యాకల్టీ రహమాన్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ గీత సోనీ, డాక్టర్ రాజేష్, డాక్టర్ రాజీవ్, పరిశోధకులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం ఇళ్లు కూల్చడం అన్యాయం

తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ఎర్రబాలెం పేదల ధర్నా - ఇళ్లు కూలిస్తే రోడ్డున పడతామని ఆవేదన

ఎర్రబాలెంలో ఈ-11 రోడ్డు అలైన్మెంట్ మార్చాలని కమిషనర్‌కు వినతి

తుళ్లూరు సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎర్రబాలెం పేదలతో ఎం.రవి తదితరులు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎర్రబాలెంలో 5దశాబ్దాలుగా కొండ దిగువన అనేక కష్టనష్టాలకోర్చుకుని పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని, విద్యుత్, నీటి పన్నులు చెల్లిస్తున్నారని, ఆకస్మికంగా ఈ-11 రోడ్డు నిర్మాణం పేరుతో వారి ఇళ్లను తొలగించడం అన్యాయమని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి అన్నారు. శుక్రవారం తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద మంగళ గిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని పేదలు ధర్నా చేశారు. ప్రతిశుక్రవారం సిఆర్‌డిఎ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో సమస్యను పరిష్కరించాలని కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు నిర్మాణమంటూ తమ ఇళ్ళను తొలగించకుండా ప్రత్యామ్నాయంగా అలైన్మెంట్ మార్పు చేయాలని విన్నవించారు. ఈసందర్భంగా ఎం రవి మాట్లాడారు. 50 సంవత్సరాల నుండి కొండ దిగువన ఇళ్లు వేసుకొని నివసిస్తున్న పేదల ఇళ్లను ఇటీవలనే అధికారులు సర్వే చేసి పట్టా లేని ఇళ్లకు పట్టాలు ఇస్తామని చెప్పారని, అంతర్గతంగా సిమెంట్ రోడ్లు కూడా మంజూరు చేసి పనులు ప్రారంభించారని చెప్పారు. ఇంతలోనే పిడుగు పడ్డట్టుగా కొందరు అధికారులు పేదల ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి జనవరిలో ఇళ్లను తొలగిస్తామంటూ హడావుడి చేయడంతో పేదలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ - 11 రోడ్డు నిర్మాణం వల్ల దళితుల స్మశానం పూర్తిగా పోతుందని, వందలాది ఇల్లు తొలగింపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత రోడ్డు నిర్మాణం కోసం ఇచ్చిన మార్కింగ్‌ను ఒకటికి రెండుసార్లు మార్చారని, అదేవిధంగా పేదలు కోరుకుంటున్న విధంగా తమ ఇళ్లపై నుండి కాకుండా అలైన్మెంట్ మార్పు చేసుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని రవి కోరారు. పేదల బాధలను సహృదయంతో అర్థం చేసుకోవాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే ఎర్రబాలెం పేదలు మంత్రి లోకేష్ కు అర్జీ అందజేశారని, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కు ఎం ఎస్ ఐ డి సి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ద్వారా అర్జీ పంపించారని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ 11 రోడ్డు నిర్మాణం ఎర్రబాలెం లోని పేదల ఇళ్లపై నుండి కాకుండా అలైన్మెంట్ మార్పు చేసే విధంగా చర్యలు చేపట్టాలని రవి విజ్ఞప్తి చేశారు. ధర్నాలో పాల్గొన్న మహిళలు మాట్లాడుతూ తమ ఇళ్ళను తొలగిస్తే చిన్న పిల్లలతో సహా కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చిన విధంగా తమ ఇళ్లకు పట్టాలు ఇచ్చి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని వారు కోరారు. ధర్నాలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామని, ఈ-11 రోడ్డు సర్వే పనులు ప్రారంభం కాలేదని, రోడ్డు నిర్మాణం జరిగే ప్రాంత ప్రజలతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని సిఆర్‌డిఎ కమిషనర్ చెప్పారని ఎం రవి తెలిపారు. ధర్నాలో రోడ్డు నిర్మాణ బాధితులు గాలి యేసు, మరియమ్మ, బట్టు విజయసాగర్, ఎ సామ్రా జ్యం, దాసరి ప్రభుదాసు, మాదాసు వసంత, రాజ్యలక్ష్మి, ఎన్ మహేష్ బాబు, సిపిఎం రాజ ధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు,పేరం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌డిఎ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అవయవదానంపై అవగాహన పెంపొందిస్తాం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అవయవదానంపై అవగాహన పెంపొందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి పి.సత్యకుమార్ తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాలలో అవయదానంపై శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుతాసుపత్రిలో రోజు కి 5 కేసులు బ్రెయిన్ డెడ్ కేసులు వస్తున్నాయని,అలాంటి కేసుల్లో అవయవ దానం చేసేలా వారితో మాట్లాడాలన్నారు. అవయవ దానం చేయడానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవయవ దానం చేసిన కుటుంబానికి 10 వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. బ్రెయిన్ డెడ్ కేసుల్లో గత సంవత్సరం లో 70 శాతం అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారని తెలిపారు. పేదరికంలో ఉన్న ప్రజలను మభ్యపెట్టి అవయవాలు తీసుకునే హాస్పిటల్స్ పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మీడియా ద్వారా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తాయని వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. అవయవ దానం గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడం ఆభినందనీయం అన్నారు. అంతకు ముందు మంత్రి మెడికల్ కళాశాలలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. సావిత్రిభాయి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే నశీర్ అహ్మద్, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.వి.కృష్ణబాబు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుందరాచారి తదితరులు పాల్గొన్నారు.

శరీర అవయవ దాతలు సంఘం ప్రతినిధికి ధ్రువ పత్రం అందిస్తున్న మంత్రి సత్య కుమార్

13 నుండి జిఎంసి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జవవరి 13, 14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ మున్సిపల్ స్టేడియంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో 3 రోజుల పాటు సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నామన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చిన్నారుల నుండి పెద్దల వరకు ప్రతి ఒక్కరినీ అలరించేలా సంబరాలను రూపొందిస్తున్నామన్నారు. సంబరాలు జరిగే స్టేడియంలో మౌలిక వసతుల కల్పనకు త్వరగా చర్యలు తీసుకోవాలని డిఈఈని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం జరిగే తొలి సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. సంబరాల్లో పాల్గొనే ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిం చారు. బొమ్మల కొలువు, చేనేత వస్త్ర ప్రదర్శన స్టాల్ కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాస రావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

ఏటి అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

ఏటి అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఏటి అగ్రహారం మెయిన్‌రోడ్ విస్తరణ పనులను, అంకిరెడ్డిపాలెంలో హిందూ శ్మశాన వాటిక వద్ద చేపట్టిన అభివద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగుఆదేశాలు జారీ చేశారు. తొలుత చుట్టగుంట సెంటర్ నుండి కంకరగుంట ఆర్‌యుబి వరకు రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. ఇప్పటికే విస్తరణ పనుల జాప్యం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పనులు వేగంగా జరిగేలా కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. పర్యటనలో సిటీప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. నాగ మల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి వెంకటేశ్వరరావు, డిఈఈలు పాల్గొన్నారు.